

# నా కళ్ళతో నాన్న

## - లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**ఈ సైన్స్** ప్రకారం మన పూర్వీకులు ఎదుర్కొన్న భయంకరమైన అనుభవాలు, సంఘటనల వల్ల కలిగిన భయం డిఎన్ఏ ద్వారా తరువాతి తరం వారికి ఫోబియాగా ఏర్పడుతుంది. ఒకే కుటుంబానికి చెందినవారికి ఒకే అంశం భయంకావడం చాలా సహజం. అలా మా నాన్నవైపు పూర్వీకులనుండి మాకు వచ్చిన ఓ ఫోబియా - పాములంటే భయం.

మాతో ఈ డిఎన్ఏ పంచుకోని వ్యక్తుల్లో మొదటిది ఊహ. చిన్నప్పుడు ఎవరైనా "నీకో కథ చెప్పనా?" అనడం ఆలస్యం "పాము కథ చెప్పవా" అనేదట. అందుకు తనని `పామునాయ్` అని కొంతమంది బంధువులు పిలుస్తారు. ఈ విషయం తెలిసిన మా నాన్న తన భయాన్ని జయించి, సాయంత్రాలు ఇందిరాపార్క్‌లో పాములని ఊహకి చూపించేవారు. లండన్ నుంచి నేలపై పెట్టగానే పాకే పాము బొమ్మలు ఊహకోసం తెచ్చారు. ఆ సంవత్సరం తీసిన ప్రతీ ఫొటోలో ఊహ చేతిలో ఓ పాము బొమ్మ కనబడుతుంది. (మా నాన్న స్థానంలో నేనుంటే పాము బొమ్మలు కొనడం కాదు కదా, ఆ పేరు కూడా ఎత్తనివ్వకుండా మందలించేదాన్ని) పోయిన సంవత్సరం కేమెన్ ఐలెండ్స్ నుండి నీసాకి కూడా ఓ పాము బొమ్మ తెచ్చారు. నా భయం కనిపెట్టిన నీసా ఓ రాత్రంతా ఆ బొమ్మతో నన్ను భయపెట్టింది. ఊహ ఇంట్లో నేను నిద్రలేని రాత్రి గడపడం అది మొదటిసారి కాదు.

తను లాఫెయెట్‌లో ఉండగా, సెలవుల్లో టీవీ చూస్తూ సోఫాలో నిద్రపోయిన నేను మధ్యరాత్రి ఏదో మీద పడగా లేచాను అదేంటా అని చేత్తో తడిమితే ఏదో మెత్తగా తగిలింది. చీకటికి కళ్ళు అలవాటు పడ్డాక నాపై ఏం పడిందా అని పరీక్షించి చూసాను. మెరుస్తున్న రెండు పెద్దకళ్ళు, సగానికి చీలిన నాలుక కనబడ్డాయి. కెవ్వున కేకేసి దాన్ని దూరంగా విసిరిపారేసాను. ఎంత శక్తితో ప్రయత్నించినా నా శరీరం అణువుకూడా కదల్లేదు. కాసేపు అలాగే వణికి, గుండె సవ్వడి చెవులకి వినబడడం ఆగాక నెమ్మదిగా లైట్ ఆన్‌చేసి చూసాను. అది ఆకుపచ్చరంగు మీద నల్లచుక్కలు గల పాము బొమ్మ. ఆ రోజు నుండీ ఊహ ఆ బొమ్మ నాకళ్ళకి కనబడకుండా దాచేస్తుంది.

అర్థరాత్రి నా అరుపుకి ఊహ లేవడం కూడా అది మొదటిసారి కాదు. జూలూస్ జూ అనే ఆటలో, స్నేక్ పార్క్‌లో ఉన్న 50 పాములు వెతకడమే ఓ లెవెల్. అది నా బదులుగా మా అమ్మ ఆడేది. పొరపాటున అవి నేను చూసినా, టీవీలో పాము కనబడినా, ఎవరైనా వాటి గురించి సంభాషించినా ఆ రోజు నాకు పీడకలలు రావడం, నేను గట్టిగా అరవడం, ఊహ భయపడడం ఎన్నో సార్లు జరిగింది. (బహుశా ఈ రోజు రాత్రి మా పక్కింటి వారికి కూడా అలానే జరుగుతుందేమో?)

వేరు వేరు కారణాలైనా నాకు, మా నాన్నకి ఉన్న ఓ లక్షణం పాలు ఇష్టపడకపోవడం. ఎప్పుడో ఓసారి పాయసం, లేదా గుళ్ళో ప్రసాదం తప్ప పాలు మా నోటిని చేరవు. (నిజానికి మా అమ్మకూడా ఇరవైరెండేళ్ళ వరకూ పాలు ఇష్టపడేది కాదు.) నాకు ఊహ తెలిసాక మా అమ్మా నాన్నా మొదటిసారి పోట్లాడుకుంది నేను పాలు తాగని విషయం గురించే.

"పెద్దదానివవుతున్నావు. ఫన్నీ బన్నీ గ్లాస్ మానేసి మామూలు గ్లాస్‌లో పాలు తాగు" అని ఓ రోజు మా అమ్మ నాతో అంది. ఆ మాజిక్ గ్లాస్‌ని తిప్పుతూ, నీలిరంగు కుందేళ్ళు డాన్స్ చెయ్యడం చూస్తూ పాలు తాగే నా చేతిలో ఓ స్టీల్ గ్లాస్ పెట్టేసరికి భోరున ఏడ్చి పాలు తాగనని గోల చేసాను. కొన్నిసార్లు "చల్లారిపోయాయి, వద్దు" అని పారేసేదాన్ని, కొన్నిసార్లు పిల్లికి పోసేదాన్ని, కొన్నిసార్లు ఎవరూ చూడకుండా సింక్‌లో పారబోసేదాన్ని. హార్లిక్స్, బోర్నవిటా, కాంప్లాన్, బూస్ట్ మార్కెట్‌లో వచ్చిన ప్రతీది నాకోసం కొనడం, రెండు స్పూన్లు వాడాక పారేయడం. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ససేమిరా పాలు తాగనని ఓ రోజు ఏడుస్తున్న నన్ను చూసి భయపడి "ఏమైంది? ఎందుకేడుస్తున్నావు?" అని ఖంగారుగా మా నాన్న అడిగారు.

"పాలు తాగనని గొడవ" సమాధానం చెప్పింది మా అమ్మ.

"పోనీ తాగద్దను. ఎందుకేడిపిస్తావు?" అని కోపంగా ప్రశ్నించారు నాన్న.

"పాలు తాగకపోతే బలం ఎక్కడ్నించి వస్తుంది?" అడిగింది అమ్మ.

"ఒక్కరోజు తాగకపోతే నష్టంలేదు" అన్నారు నాన్న.

"ఒక్కరోజు కాదు. రోజూ ఇదే గొడవ" అసహనంగా చెప్పింది అమ్మ.

"చిన్న చిన్న విషయాలకి దాన్ని ఏడిపించకు పద్మ" కోప్పడ్డారు నాన్న.

"సరే. ఇక దానంతట అది అడిగేవరకూ నేను పాలు తాగమనను" అని చేతులు దులుపుకుంది మా అమ్మ. ఈరోజుకీ నేను పాలు అడగలేదు, మా అమ్మ ఇవ్వలేదు.

నేను, మా అమ్మ, నాన్న పంచుకునే కొన్ని అభిరుచులు మిస్టరీ లేదా కామెడీ పుస్తకాలు చదవడం. డ్రామా ఇష్టపడకపోవడం (అవి మా నాన్న నవలల్లో కనబడుతూనే ఉంటాయి.) అలాగే పాతకాలం బ్లాక్ అండ్ వైట్ సినిమాలు, ట్విలైట్ జోన్ వంటి సీరియల్స్ కలిసి చూడ్డం మా అలవాటు. ఫ్రాంక్ బొర్జాగీ, ఆల్‌ఫ్రెడ్ హిచ్ కాక్ సినిమాలు చూడ్డానికి నాకు మా నాన్నకన్నా మంచి కంపెనీ దొరకదు. కొత్త సినిమాలు బొత్తిగా చూడకపోవడం, ఇష్టపడకపోవడం కూడా మేము పంచుకునే లక్షణం. హౌటు స్టీల్ ఎమిలియన్, సెవెంత్ హెవెన్, ఐ వస్ ఎ మేల్ వార్ బ్రైడ్, రోప్ వంటి సినిమాలు చూసిన మా కళ్ళకి లాజిక్ లేని సినిమాలు, కుళ్ళు జోకులు నచ్చవు. "సినిమాని సినిమాలా చూడాలి లిపి" అని ఎంతోమంది చెప్పినా ఆ వాక్యానికి అర్థం నాకు ఇంకా అంతుపట్టలేదు. మా నాన్న చదివిన పుస్తకాలు నాకోసం ఉంచుతారు. "నాన్నా, ఈ బుక్ చాలా బావుంది. నీకు నచ్చుతుందనుకుంటా" అని నేను ఎన్నో సార్లు అన్నాను.

"ఇది ఫలానా రైటర్ రాసింది కదమ్మా? చదివాను. నాక్కూడా నచ్చింది" అన్న జవాబే ఎక్కువసార్లు విన్నాను. రోమన్ హాలిడే చూసాక మానాన్నలాగే నేనూ ఆడ్రీ హెప బర్న్, గ్రెగరీ పెక్‌ల ఫాన్ అయ్యాను. ఆ సినిమాని తెలుగులో తీసారని కొన్నేళ్ళక్రితం మా అమ్మ చెప్పింది. చూస్తున్నంత సేపు, "సేం స్టోరీ.. ఆడ్రీ హెప్ బర్న్ ఎంత బాగా చేసిందో.. అదేంటి? స్టోరీ మార్చారా?" అని నేను నోరు మూత

పడకుండా కామెంట్ చేస్తూనే ఉన్నా. మా నాన్న రెండు నిమిషాలకన్నా ఎక్కువ చూడలేకపోయారు. అలా పాత సినిమాలని తెలుగు, లేదా హిందీలో తీసినవి నాతో చూడ్డానికి నా ఫ్రెండ్స్ ఇష్టపడరు. "ప్లీజ్ లిపి. ఆపేయ్. స్టోరీ చెప్పకు" అంటారు.

మా నాన్న ఎక్కడికి వెళ్ళినా ఓ పోస్ట్ కార్డ్ మీద ఉత్తరం రాసి మా అమ్మకి, నాయనమ్మకి పంపేవారు. ఇన్‌లాండ్ లెటర్స్, పెద్ద ఉత్తరాలు పంపినా పోస్ట్‌కార్డ్ మీద రాసిన ఆ నాలుగు వాక్యాలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయ్. మా అమ్మా, నాన్నా కలిసి ప్రయాణించినప్పుడు కావ్య, ఊహలకి కార్డు పంపారు. నా జీవితంలో నాకు వచ్చిన మొదటి ఉత్తరం మా నాన్న రాసిందే. అటువంటి ఉత్తరాలకి ఉన్న సెంటిమెంటల్ వాల్యూ తెలుసుకనుక నేను ప్రయాణించినప్పుడు హైదరాబాద్‌లో అమ్మా, నాన్నకి, నార్వేలో కావ్యతోపాటు మూడు గంటల దూరంలో ఉన్న ఊహ, నందు, నీసాకి కూడా కార్డు పంపాను. ఇంటర్నెట్ ఉన్నా, ఫోన్లున్నా, ఉత్తరాలు ఉత్తరాలే.

మా నాన్న నుండి నాకు వచ్చిన మరో పోలిక చేతి్రవాత బావుండకపోవడం. నా రైటింగ్ "డాగ్ లెఫ్ట్ లెగ్‌తో రాసినట్టుంది" అని మా అమ్మ అభిప్రాయం.

ఓసారి ఇంటికొచ్చిన ఒకావిడ "మీ నాన్నకి షార్ట్ హాండ్ వచ్చని నేను అనుకోలేదు" అని ఓ పేపర్ ముక్క చూస్తూ అన్నారు.

"అది తెలుగు" అని నేను బదులిచ్చాను.

"ఇది తెలుగులా లేదు. షార్ట్ హేండ్ అయ్యుంటుంది" అని ఆవిడ అన్నారు.

"మీరు చదవగలరా?" అని అడిగాను.

"లేదు. ఇప్పుడు మర్చిపోయాను" అని అన్నారు.

"వచ్చినా అర్థంకాదు. అది తెలుగే" అని నేను చెప్పినా ఆవిడ నమ్మలేదు.

స్కూల్లో టీచర్స్‌కి మా నాన్న రైటింగ్ ఎలా అర్థమయ్యేదో అని నేను, కావ్య, ఊహ అనుకునేవాళ్ళం. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన ప్రతిసారీ "రైటింగ్ బాలేదనే మార్క్స్ వచ్చుండవు" అని సరిపెట్టుకునేదాన్ని. మా నాన్న నాకోసం ప్రతీ సంవత్సరం కాపీ రైటింగ్ బుక్స్ తెచ్చేవారు. అందుకే ఈ మాత్రం ఉందేమో.

'సాహిత్యం రక్తంలో ఉంటేనే రచయితలౌతారు' అని అంటారు.

"మీ కుటుంబంలో ఎవరైనా రచయితలున్నారా?" అని మా నాన్నని ఎంతోమంది అడగడం విన్నాను. కవితలు రాసే అమ్మ, నవలలు రాసే నాన్ననుండి నాకు రాయడం అబ్బింది. కానీ మా నాన్న జీవితంలో అలా ఎవరూ లేరు. ఎంత పెద్ద వృక్షమైనా ముందు ఓ బీజముండాలి. మా కుటుంబంలో రచనలకి, సాహిత్యానికి విత్తనం మా నాన్న. తదుపరి తరాలకి ఆయననుండి రచన వస్తుందేమోకానీ, రచయిత అవ్వడం కేవలం ఆయన ప్రత్యేకత మాత్రమే. అందుకు ఎవ్వరి డిఎన్ఏ, ఏ జీన్స్, ఏ వంశ పారంపర్యంలేవు.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story